నమస్తే తెలంగాణ
# సూర్యాపేట
10 | నల్లగొండ, శుక్రవారం 21 ఫిబ్రవరి 2025 | SURYAPET

## రెండు దవాఖానలు సీజ్

- నిబంధనలకు విరుద్ధంగా నడుపుతుండడంతో డీఎంహెచ్ఓ చర్యలు


హుజూర్‌నగర్‌లో బాబు క్లినిక్‌ను సీజ్ చేస్తున్న జిల్లా వైద్యాధికారులు

హుజూర్‌నగర్/నేరేడుచర్ల, ఫిబ్రవరి 20 : హుజూర్‌నగర్ నియోజకవర్గంలో నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న రెండు ప్రైవేట్ దవాఖానలకు జిల్లా వైద్యాధికారి కోటాచలం గురువారం సీజ్ చేశారు. హుజూర్‌నగర్‌లో కొంతకాలంగా డాక్టర్‌గా చలామణి అవుతూ అనుమతులు లేకుండా వైద్యం చేస్తున్న బాబు క్లినిక్‌ను క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టం కింద చర్యలు తీసుకున్నారు. క్లినిక్‌లో గ్లూకోజ్ ఎక్కిస్తూ, ఎక్కువ మోతాదులో స్టెరాయిడ్స్ ఇస్తున్నట్లు గుర్తించి క్లినిక్‌ను సీజ్ చేశారు. నేరేడుచర్ల మండల కేంద్రంలో స్టార్ హాస్పిటల్‌నూ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నారని గుర్తించి సీజ్ చేశారు. ఆర్‌ఎంపీలు అర్హతకు మించి వైద్యం చేస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్ఓ హెచ్చరించారు.


దురాజ్‌పల్లి లింగమంతుల స్వామి దర్శనం కోసం బారులుదీరిన భక్తులు

## మళ్లొస్తాం.. లింగన్నా!

**మకర తోరణం తరలింపుతో పెద్దగట్టు జాతర సంపూర్ణం**

చివ్వెంల, ఫిబ్రవరి 20 : ఐదు రోజులపాటు లక్షలాది మంది భక్తులతో కిట కిటలాడిన దురాజ్‌పల్లి పెద్దగట్టు లింగమతుల జాతర గురువారంతో ముగిసింది. చివరి రోజు కూడా 2 లక్షల మందికిపైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయానికి అలంకరించిన మకర తోరణాన్ని యాదవ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు భేరీ చప్పుళ్ల మధ్య సూర్యాపేటలోని గొల్ల బజార్‌కు సాంప్రదాయ బద్ధంగా తరలించడంత జాతర సంపూర్ణమైంది. అంతకుముందు ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం యాటను బలిచ్చి మొక్కు చెల్లించుకుని, సహపంక్తి భోజనం చేశారు. టీజీపీఎస్సీ సభ్యురాలు పాల్వాయి రజనీకుమారి స్వామివారిని దర్శించుకున్నారు. జాతరకు రాష్ట్ర నలుమూలలతోపాటు పొరుగు రాష్ట్రాల నుంచి మొత్తంగా 20 లక్షల మంది వరకు భక్తులు వచ్చి ఉంటారని నిర్వాహకులు తెలిపారు. వ్యాపారాలు సైతం అదే స్థాయిలో జరగడంతో నిర్వాహకులు సంతోషంగా ఇంటి బాట పట్టారు. రద్దీ నేపథ్యంలో గురువారం కూడా ట్రాఫిక్ జామ్ అయ్యింది. స్వామి వారి హుండీకి మొత్తంగా 31 లక్షల 29 వేల 686 రూపాయల ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. లెక్కింపు కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పోలెబోయిన నర్సయ్య యాదవ్, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సుమతి, తాసీల్దార్ కృష్ణయ్య, ఈఓ కుశలయ్య, కమిటీ సభ్యుడు నగేశ్ పాల్గొన్నారు.

# సర్వం సిద్ధంగా ఉన్నా ప్రారంభానికి పరేషాన్

**పనులు పూర్తయినా ప్రారంభానికి నోచని నిర్మాణాలు**

**బీఆర్‌ఎస్‌కు మంచి పేరు వస్తుందని పట్టించుకోని ఎమ్మెల్యేలు**

- అన్నీ రెడీ అయినా నీరా ప్లాంట్‌పై నిర్లక్ష్యం
- అద్భుతమైన శిల్పారామం ప్రారంభం ఎప్పటికో?
- భువనగిరిలో అంబేద్కర్ భవనంపై చిన్నచూపు
- సమీకృత మార్కెట్‌దీ అదే పరిస్థితి
- కాంగ్రెస్ సర్కారు తీరుపై స్థానికుల మండిపాటు
- నిర్మాణాలను అందుబాటులోకి తేవాలని డిమాండ్

అన్నీ ప్రజలకు ఉపయోగపడే నిర్మాణాలు.. కొన్ని ఆహ్లాదం పంచేవి. సౌకర్యవంతమైనవి మరికొన్ని ఎందరికో ఉపాధి నిచ్చేవి. బీఆర్‌ఎస్ సర్కారులోనే బ్రహ్మాండంగా దాదాపు పనులన్నీ పూర్తి చేసుకున్నాయి. కేవలం తుది మెరుగులు దిద్దితే చాలు. కానీ కాంగ్రెస్ సర్కారు మాత్రం వాటిని ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు మనస్సు రావడం లేదు. జనం మొరపెట్టుకుంటున్నా వాటి దిశగా కనీసం చూడడం లేదు.

– యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 20 (నమస్తే తెలంగాణ)


రాయిగిరిలోని మినీ శిల్పరామం

### శిల్పారామం ప్రారంభం ఎప్పుడో..?

యాదగిరిగుట్ట ప్రధానాలయం పునర్నిర్మాణంలో భాగంగా వైటీడీఏ నిధులతో ఎకరన్నరంలో రాయగిరిలో మినీ శిల్పారాయం ఏర్పాటు చేశారు. స్వాగత తోరణం, పిల్లలు ఆడుకునేందుకు, పెద్దలు సేద తీరేందుకు మైదానం సిద్ధం చేశారు. రాత్రివేళల్లో పరిసరాలన్నీ జిగేల్ అనిపించేలా తీర్చిదిద్దారు. శిల్ప, హస్తకళా వైభవం ఉట్టిపడే విధంగా రాయగిరి చెరువుకు సొబగులు అద్దారు. పనులన్నీ పూర్తయినా కాంగ్రెస్ సర్కారులో మినీ శిల్పారామం ప్రారంభానికి నోచడం లేదు. దాంతో శిల్పారామంలో ఏర్పాటుచేసిన ఆట వస్తువులు, ఫుడ్ కోర్టులు నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరుతున్నాయి.

### అంబేద్కర్ భవనం ఊసేలేదు

జిల్లా కేంద్రంలో అంబేద్కర్ భవనం నిర్మించేందుకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం సింగన్నగూడెం రస్తా సమీపంలో గల సర్వే నంబర్ 629లో 900 గజాల స్థలం కేటాయించింది. 2017 డిసెంబర్ రెండున భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ క్రమంలో నిర్మాణానికి స్థలం సరిపోదని ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి దృష్టికి కమిటీ సభ్యులు తీసుకెళ్లగా ఆయన చొరవతో కలెక్టర్ అదే సర్వేనంబర్‌లో అదనంగా 1,810 గజాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించారు. పనులు ప్రారంభించారు. గ్రౌండ్‌ఫ్లోర్‌లో చిన్న చిన్న సమావేశాల కోసం ఓపెన్ హాల్, జీ ప్లస్‌లో అంబేద్కర్ ఆడిటోరియం, నిరుద్యోగులు పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవడానికి వీలుగా స్టడీ సర్కిల్, గ్రంథాలయం, ఒకేషనల్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. భవన నిర్మాణ పనులు ఎప్పుడో తుది దశకు చేరుకున్నాయి. కానీ ప్రారంభానికి మాత్రం నోచడం లేదు.


భువనగిరి మండలం నందనంలోని నీరా కేంద్రం

### నందనం నీరా ప్లాంట్‌పై నిర్లక్ష్యం

గీతకార్మికుల సంక్షేమం కోసం భువనగిరి మండలంలోని నందనం గ్రామంలో నీరా ప్లాంట్ ఏర్పాటు చేయాలని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం సంకల్పించింది. గీత కార్మికులకు ఆసరాగా నిలువడంతోపాటు ప్రజలకు నీరా అందుబాటులోకి తేవాలని నిర్ణయించింది. ఆ మేరకు నందనంలో నాలుగు ఎకరాల్లో భవనం నిర్మించేందుకు రూ.8కోట్లు విడుదల చేసింది. 2022 జూలై 29న అప్పటి మంత్రి ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, నాటి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి నీరా కేంద్రం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. గతేడాదే భవన నిరాణాలు పనులన్నీ పూర్తయ్యాయి. నీరా నిల్వకు అవసరమైన వివిధ రకాల యంత్రాలను కూడా అమర్చారు. అన్నీ రెడీగా ఉన్నా ప్రస్తుతం కేంద్రాన్ని ప్రారంభించకుండా తాళం వేయడంతో నిరుపయోగంగా మారింది.

### సమీకృత మార్కెట్‌దీ అదే పరిస్థితి..

కూరగాయలు, పండ్లు, మాంసం ఉత్పత్తులు పట్టణ ప్రజలకు ఒకేచోట అందుబాటులో ఉండేలా భువనగిరిలో నిర్మించిన సమీకృత మార్కెట్ పనులు తుది దశలో నిలిచిపోయాయి. మార్కెట్లో 192 స్టాళ్లు నిర్మించారు. నాన్‌వెజ్‌కు 48, వెజ్‌కు 102, పండ్లు, పూల విక్రయాలకు 20, ఇతర వస్తువుల విక్రయానికి 13 స్టాళ్లు నిర్మించారు. రంగులు వేయడం, సెట్టర్లు బిగించడం పూర్తయ్యింది. సిమెంట్ కాంక్రీట్ (సీసీ), విద్యుత్ పనులు మాత్రమే మిగిలి ఉన్నాయి. కాంగ్రెస్ సర్కారులో ఏడాది కాలంగా పైసా విడుదల కాకపోవడంతో ఇప్పటికే పూర్తయిన నిర్మాణాలు అలంకారప్రాయంగా మారాయి. ప్రభుత్వం స్పందించి ఈ నిర్మాణాలు అన్నింటినీ అందుబాటులోకి తేవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.


భువనగిరిలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్


పీఏసీఎస్ చైర్మన్ కేవీ రామారావును పరామర్శిస్తున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్

## బీఆర్‌ఎస్ నేత కేవీరామారావుకు మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి పరామర్శ

నిడమనూరు, ఫిబ్రవరి 20 : హైదరాబాద్ గచ్చిబౌలి కేర్ ఆసుపత్రిలో గుండె శస్త్రచికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న బీఆర్‌ఎస్ నాయకుడు, వెనిగండ్ల పీఏసీఎస్ చైర్మన్ కేవీ రామారావును మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి పరామర్శించారు. తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్‌తో కలిసి గురువారం ఆయన ఆసుపత్రికి వెళ్లారు. రామారావుతోపాటు మాట్లాడడంతోపాటు వైద్యులను అడిగి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య బృందాన్ని కోరారు.


ఎమ్మెల్సీ కవితను కలిసిన దళిత బంధు సాధన కమిటీ సభ్యులు, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల

## రెండో విడుత దళిత బంధు ఇవ్వాల్సిందే

- లేనిపక్షంలో పోరాటానికైనా సిద్ధం
- కేసీఆర్ సర్కారులోనే నిధుల విడుదల
- దళిత బంధు బాధితులకు ఎమ్మెల్సీ కవిత భరోసా
- మాజీ ఎమ్మెల్యే కంచర్ల ఆధ్వర్యంలో కలిసిన నల్లగొండ దళిత బంధు సాధన కమిటీ సభ్యులు

నల్లగొండ రూరల్, ఫిబ్రవరి 20 : దళిత బంధు సాధన సమితి ఆధ్వర్యంలో రెండో విడుత దళిత బంధు అందని బాధితులు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను కలిశారు. నల్లగొండ మాజీ కంచర్ల భూపాల్‌రెడ్డితో కలిసి గురువారం హైదరాబాద్‌లోని ఆమె నివాసానికి వెళ్లి గోడు వెల్లబోసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ దళితులకు తీవ్ర ద్రోహం చేస్తున్నదన్నారు. ఎన్నికల ముందు కోడ్‌తో ఆగిపోయిన దళిత బంధు లబ్ధిదారులందరికీ బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రొసీడింగ్‌లు ఇచ్చిందని, లబ్ధిదారులందరూ బ్యాంకు ఖాతాలు కూడా ఓపెన్ చేశారని, ఇందుకు సంబంధించి నిధులు కూడా కేసీఆర్ ప్రభుత్వం విడుదల చేసిందని గుర్తుచేశారు. ఇప్పుడు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం లబ్ధిదారులపై కక్షకట్టి నిధుల విడుదలకు ఆటంకం కల్పించడం అన్యాయమన్నారు. ఆ రోజు గ్రౌండింగ్ పూర్తయిన వారందరికీ ఇప్పటికైనా నిధులు విడుదల చేసి చిత్తశుద్ధి చాటుకోవాలని హితవు పలికారు. లేనిపక్షంలో ఎటువంటి పోరాటానికైనా సిద్ధమని హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ దళిత బంధు ఇవ్వకుండా మోసం చేస్తున్న ప్రభుత్వానికి దళితులు తగిన రీతితో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో నల్లగొండ నియోజకవర్గం నుంచి దళిత బంధు సాధన సమితి కమిటీ కన్వీనర్ లక్ష్మయ్య, కో కన్వీనర్ బడుపుల శంకర్, లింగయ్య, మర్రి రేణుక, రూపని రవి, రాంబాబు, యాదయ్య, నాగయ్య, ఏడుకొండలు, కృష్ణయ్య, నాగర్జున, వెంకన్న, జానీ, పిచ్చయ్య పాల్గొన్నారు.

## సాగునీటి కోసం రైతుల రాస్తారోకో

**పెన్‌పహాడ్ మండలానికి నీళ్లివ్వాలని సూర్యాపేట-దంతాలపల్లి రహదారిపై రైతుల ధర్నా**


కోటినాయక్ తండా వద్ద ఎస్సారెస్పీ కాల్వ బ్రిడ్జిపై రాస్తారోకో చేస్తున్న పెన్‌పహాడ్ మండల రైతులు

ఆత్మకూర్.ఎస్, ఫిబ్రవరి 20: వరి పంటను కాపాడుకునేందుకు నీళ్ల కోసం రైతులకు రోడ్డెక్కారు. ఎస్సారెస్పీ కాల్వల ద్వారా వారబందీ పద్ధతిలో నీళ్లిస్తామని చెప్పిన పాలకులు విఫలమవడంతో వారం వారం ఆందోళనకు దిగాల్సిన దుస్థితి దాపురించింది. సూర్యాపేట జిల్లా ఆత్మకూర్.ఎస్ మండలంలోని కోటినాయక్‌తండా వద్ద ఎస్సారెస్పీ కాల్వ బ్రిడ్జిపై పెన్‌పహాడ్ మండలానికి చెందిన రైతులు గురువారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ వారబందీ పద్ధతిలో ఈ నెల 16న గోదావరి జలాలు విడుదల చేసిన అధికారులు ప్రధాన కాల్వకు నీటిని అందించకపోవడంతో పెన్‌పహాడ్ మండలంలో పంటలు ఎండుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కోటినాయక్ తండా వద్ద ఎస్సారెస్పీ మెయిన్ కెనాల్ డీబీఎం 71 ద్వారా పెన్‌పహాడ్ మండలానికి నీరు రావాల్సి ఉండగా, ప్రధాన కాల్వకు నీళ్లు అందించకుండా 36ఎల్ కాల్వ ద్వారా మోతె మండలానికి తరలిస్తున్నారని మండిపడ్డారు. పాలకులు, అధికారులు నీటి సరఫరాలో పక్షపాతం వహిస్తున్నారని మండిపడ్డారు. నీటిని విడుదల చేసిన సమయంలోనూ గేట్ల వద్ద సిబ్బందిని పెట్టకపోవడంతో రాత్రిళ్లు గుర్తు తెలియని వ్యక్తులు మెయిన్ కాల్వ గేట్లు మూసేసి నీటిని మళ్లిస్తున్నారని వాపోయారు. పది రోజుల క్రితం ఏకంగా ప్రధాన కాల్వ గేట్లకు వెల్డింగ్ చేసినా అధికారులు చర్యలు తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'కలెక్టర్ రావాలి.. ఇరిగేషన్ ఏఈఈ డౌన్ డౌన్' అంటూ నినాదాలు చేశారు. ఇరిగేషన్ డీఈ రమేశ్ అక్కడికి చేరుకుని నీటిని విడుదల చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. అనంతరం ప్రధాన కాల్వ గేట్లను ఎత్తడంతో మెయిన్ కెనాల్ నుంచి నీటి సరఫరా ప్రారంభమైంది. రైతులు గంటపాటు రాస్తారోకో చేయడంతో సూర్యాపేట–దంతాలపల్లి ప్రధాన రహదారిపై కిలోమీటర్ మేర వాహనాలు నిలిచిపోయాయి.

## ధార్ గ్యాంగ్ లీడర్ అరెస్ట్

- మోస్ట్ వాటెండ్ క్రిమినల్‌ను పట్టుకున్న నల్లగొండ జిల్లా పోలీసులు
- నార్కెట్‌పల్లిలో చోరీ చేసి సొమ్ము రికవరీ
- ముఠా నాయకుడు మహ్మద్ అస్రఫ్ ఖాన్‌కు రిమాండ్



నిందితుడి నుంచి రికవరీ చేసిన సొమ్మును చూపుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నీలగిరి, ఫిబ్రవరి 20 : కరుడు గట్టిన దొంగల ముఠా నాయకుడు, దేశవ్యాప్తంగా ఎన్నో నేరాలకు పాల్పడిన ధార్ గ్యాంగ్ లీడర్‌ను నల్లగొండ జిల్లా పోలీసులు పట్టుకున్నారు. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ గురువారం తన కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. ఈ నెల 9న నెల్లూరుకు చెందిన బోయిన వెంకటేశ్వర్లు మౌరిటెక్ సంస్థ యాజమాని దామోదర్‌రెడ్డి స్థలం అమ్మగా వచ్చిన డబ్బు రూ.25లక్షలు తీసుకుని చెన్నై నుంచి హైదరాబాద్‌కు ప్రైవేట్ ట్రావెల్స్‌లో బయల్దేరాడు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లిలోని పూజిత హోటల్ వద్దకు రాగానే టిఫిన్ కోసం బస్సు ఆపారు. వెంకటేశ్వర్లు మూత్ర విసర్జన కోసం బస్సు దిగగా, బస్సులో ఉన్న 25లక్షల బ్యాగును గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు జిల్లా పోలీస్ యంత్రాంగం దర్యాప్తు మొదలు పెట్టింది. ఇందుకోసం నాలుగు సీసీఎస్ బృందాలను ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల పుటేజీ ఆధారంగా కొందరు వ్యక్తులు బ్యాగ్ తీసుకుని కారులో వెళ్లడం గుర్తించారు. ఆ వ్యక్తులను పాత నేరస్తులతో పోల్చి చూడగా.. మధ్యప్రదేశ్ రాష్ట్రం మన్వర్ తాలుకా కేద్వా జాగీర్‌లోని రాళ్లమండల్‌కు చెందిన ధార్ గ్యాంగ్‌గా తేలింది. ఆ ముఠా నాయకుడు మహ్మద్ అస్రఫ్ ఖాన్ ముల్తా నీ షేక్, లైబ్ ఖాన్, అక్రమ్ ఖాన్, మహబూబ్‌ఖాన్‌ను చోరీ చేసినట్లు గుర్తించారు. దాంతో మధ్యప్రదేశ్‌కు వెళ్లి అక్కడి పోలీసుల సహకారంతో ధార్ గ్యాంగ్ ఇండ్లపై దాడులు చేశారు. నిందితులు ముగ్గురు పరారు గానీ, ప్రధాన నిందితుడిగా మహ్మద్ అస్రఫ్ ఖాన్‌ను పట్టుకున్నారు. అతడి ఇంట్లో నగదును స్వాధీనం చేసుకున్నారు. నార్కట్‌పల్లిలో దొంగిలించిన మొత్తం నగదుతోపాటు నిందితులు చోరీ చేసిన కర్నాటకకు చెందిన కారును కూడా స్వాధీనం చేసుకున్నారు. కేసును ప్రతిష్టత్మకంగా తీసుకుని ఛేదించిన సీసీఎస్ పోలీసులను ఎస్పీ అభినందించారు. సమావేశంలో డీఎస్పీ శివరాంరెడ్డి, సీఐ నాగరాజు. నార్కట్‌పల్లి ఎస్ఐ క్రాంతికుమార్, సీసీఎస్ ఎస్ఐ శివకుమార్ పాల్గొన్నారు.



నకిరేకల్ పోలీస్ స్టేషన్‌లో ఉన్న విద్యుత్‌శాఖలో పని చేసే సిబ్బంది

## విద్యుత్ సౌధకు వెళ్తున్న ఆర్టిజన్ల అరెస్ట్

నకిరేకల్, ఫిబ్రవరి 20 : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ హైదరాబాద్‌లోని విద్యుత్‌సౌధ ఎదుట ఆందోళనకు వెళ్తున్న విద్యుత్ శాఖలో పనిచేస్తున్న 40 మంది ఆర్టిజన్స్‌ను గురువారం నకిరేకల్ పోలీసులు అరెస్ట్ చేశారు. నకిరేకల్ మండలంలోని వివిధ సబ్‌స్టేషన్ల పరిధిలోని సబ్‌స్టేషన్ ఆపరేటర్లు, ఫీల్డ్ వర్కర్లు, ఆఫీస్ స్టాఫ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశా రు. పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో ఆర్టిజన్స్ సిబ్బంది టి.రవీందర్ రెడ్డి, మాద నగేశ్, పి. లక్ష్మి, కొండ శ్రీనివాస్, జి.శేఖర్, వి. రాంబాబు, ప్రభాకర్, రమేశ్, వెంకటయ్య ఉన్నారు.

## రాష్ట్రంలో ఆత్మహత్యలు.. ఆకలి కేకలు

- ప్రభుత్వంపై ప్రజలు తిరుగబడే రోజులు వస్తున్నయ్
- మళ్లీ కేసీఆర్ పాలననే కోరుకుంటున్న ప్రజలు
- మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్య గౌడ్


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్

రాజాపేట, ఫిబ్రవరి 20 : ఆత్మ బలిదానాలు, ఆత్మస్థైర్యంతో సాధించుకున్న ప్రత్యేక రాష్ట్రం నేడు కాంగ్రెస్ పాలనలో ఆత్మహత్యలు, ఆకలి కేకల తెలంగాణగా మారిందని ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు. రాజాపేట మండల కేంద్రంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ప్రజా సమస్యలను పట్టించుకోకుండా వంచించడంలో ప్రభుత్వం ముందుందని ఆరోపించారు. కేసీఆర్ పాలన స్వర్ణయుగంగా సాగిందని, ప్రత్యేక తెలంగాణ సాధించుకొని సబ్బండ వర్గాల అభివృద్ధి ధ్యేయంగా కేసీఆర్ పని చేశారని తెలిపారు. ప్రజలు కేసీఆర్ పాలననే మళ్లీ కోరుకుంటున్నారన్నారు. రేవంత్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. రుణమాఫీ, రైతు భరోసా, మహాలక్ష్మి పథకం, కల్యాణలక్ష్మిలో తులం బంగారం ఊసే లేకుండా పోయిందని, హామీల అమలు కోసం ప్రజలు ప్రభుత్వంపై తిరుగబడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని హెచ్చరించారు. రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. వృత్తులు నిర్వీర్యమవుతున్నాయని, రైతులు, నేత, గీత కార్మికులు, నిరుద్యోగులు పిట్టల్లా రాలిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ అపర భగీరథుడిలా సాగునీటి పథకాల కోసం కృషి చేశారని, కాంగ్రెస్ పాలన ఏడాదిన్నర కావస్తున్నా సాగునీటి కోసం తట్టెడు మట్టి తీసిన దాఖలాలు లేవని పేర్కొన్నారు.